క్లుప్తంగా

రైతులకు అందుబాటులో విత్తనాలు



అడవిదేవులపల్లిలో సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అడవిదేవులపల్లి: యాసంగి సీజన్‌లో రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అర్చన అన్నారు. సోమవారం అడవిదేవులపల్లి పరిసరాల్లో సాగు చేసిన వివిధ రకాల పంటలను ఆమె పరిశీలించి మాట్లాడారు. నీటి వసతి లేని రైతులు వేరుశనగ, మినుములు, పెసర్లు, బొబ్బర్లు వంటి పంటలను సాగు చేసుకోవాలన్నారు. నీటి వసతి(బోర్లు, బావులు) ఉన్న వారు వరి సాగు చేసుకోవచ్చన్నారు. ఆమె వెంట ఏఈఓలు మహేష్‌నాయక్, రైతులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న విజయసింహారెడ్డి

మిర్యాలగూడ: పదవులు ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియమితులైన కార్పొరేషన్ చైర్మన్ల పదవులను రద్దు చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. తాను ఈ నెల 7వ తేదీనే తన కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల మధ్యలోనే ఉంటానని పేర్కొన్నారు.

సీఎంని కలిసిన వల్లభరెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వల్లభరెడ్డి

నిడమనూరు: మండలంలోని తుమ్మడం గ్రామానికి చెందిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ యడవెల్లి వల్లభరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా నర్యానాయక్



నర్యానాయక్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, సర్పంచులు

దేవరకొండ: మండల సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా కొర్రతండా సర్పంచ్ రాత్లావత్ నర్యానాయక్‌ను ఎన్నుకున్నారు. సోమవారం దేవరకొండలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడితో పాటు గౌరవ అధ్యక్షుడిగా మూడావత్ నాగరాజు, ముఖ్య సలహాదారుడిగా కడారి అయ్యన్నను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జూలూరి ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు రమావత్ పద్మ, కావటి ఆంజనేయులు, మాచర్ల అంజయ్య, కిన్నెర యాదయ్య, నిర్మల, గోపాల్ నాయక్, నోముల లక్ష్మిశ్రీ, సుశీల, నేనావత్ నారాయణ తదితరులున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



డిండి పోలీస్ స్టేషన్ చౌరస్తా వద్ద కంచె లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

డిండి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ చౌరస్తా వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో ఎప్పుడు రద్దీగా ఉండే ఆ ప్రదేశంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్త్రీ శక్తి భవనం.. శిలాఫలకానికే పరిమితం

- నిధులు మంజూరైనా స్థలం కరువు
- దశాబ్దకాలంగా స్థల సేకరణలో అధికారుల నిర్లక్ష్యం
- అద్దె భవనంలో అవస్థలు పడుతున్న సిబ్బంది

గుర్రంపోడు: మండల కేంద్రంలో స్త్రీ శక్తి భవన నిర్మాణం దశాబ్ద కాలంగా శిలాఫలకానికే పరిమితమైంది. స్థల సేకరణ సమస్యతో నిధులు మంజూరైనా భవన నిర్మాణం ముందుకు సాగడం లేదు. 2011లో అప్పటి పంచాయితీరాజ్ శాఖ మంత్రి కుందూరు జానారెడ్డి గుర్రంపోడు మండల కేంద్రంలోని ఏఎమ్మార్పీ క్యాంపు కాలనీలో 378 సర్వే నంబర్‌లో ఎనిమిది గుంటల భూమి సర్వే చేసి స్త్రీ శక్తి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25లక్షల నిధులు మంజూరు కాగా భవన నిర్మాణ పనులు ప్రారంభించడానికి నీటిపారుదల శాఖ నుంచి అనుమతి లభించడంలో తీవ్ర జాప్యం జరిగింది. శంకస్థాపన చేసింది ప్రభుత్వ స్థలం కావడం.. అప్పటికే ఆ స్థలం పక్కన పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎమ్మార్సీ భవన నిర్మాణాలు జరగడంతో స్థలం అప్పగింత లాంఛనమేనని అందరూ భావించారు. కానీ నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ నుంచి అనుమతి లభించలేదు. అప్పటి నుంచి స్థల సేకరణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం స్త్రీ శక్తి కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదుల్లో మహిళలు సమావేశాలు జరుపుకోవడం ఇబ్బందిగా ఉంది.



స్త్రీ శక్తి కార్యాలయం కొనసాగుతున్న అద్దె భవనం ఇదే..



స్త్రీ శక్తి భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

అవస్థలు పడుతున్నాం



ప్రస్తుతం స్త్రీ శక్తి భవనం కొనసాగుతున్న అద్దె భవనంలో సరైన వసతులు లేవు. సమావేశ మందిరం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. త్వరగా స్త్రీ శక్తి భవన నిర్మాణం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తరి ఉమారాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు

రెవెన్యూ అనుమతులు ఉన్నా..

కాగా 2011లో శిలాఫలకం వేసిన స్థలానికి సమీపంలోనే మరో స్థలం ఉన్నట్లు మూడేళ్ల క్రితం రెవెన్యూ శాఖ నివేదిక అందజేసింది. మారిన అంచనా వ్యయంతో భవన నిర్మాణానికి మళ్లీ రూ.35 లక్షలు మంజూరయ్యాయి. కానీ చీఫ్ ఇంజనీర్ స్థాయిలో అనుమతులు ఆలస్యమవుతుండంతో ఇటీవల స్థానిక అధికారులు డీఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా స్థల సేకరణకు అనుమతులు పొంది భవన నిర్మాణం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ



బీఎల్ఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు



ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోషం సునీత

మిర్యాలగూడ: మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్ఆర్)ని సోమవారం మిర్యాలగూడలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తానని బీఎల్ఆర్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కంచర్ల అనంతరెడ్డి, అధ్యక్షుడు అనుముల మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాప చెన్నారెడ్డి, కౌన్సిలర్లు వంగాల నిరంజన్‌రెడ్డి, శాగ జయలక్ష్మీజలంధర్‌రెడ్డి, నాయకులు మన్నెం బుచ్చిరెడ్డి, పాశం నరసింహారెడ్డి, నామిరెడ్డి నరసింహారెడ్డి, నామిరెడ్డి రమేష్‌రెడ్డి, పాదూరు లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, యరసాని నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పోషం సునీత

మిర్యాలగూడ అర్బన్: తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి, మిర్యాలగూడ పట్టణంలోని శ్రీబాలాజీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ పోషం సునీత సోమవారం మిర్యాలగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సమష్టిగా అభివృద్ధికి కృషిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జాన్‌యాదవ్

దేవరకొండ: మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని దేవరకొండ ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల సమావేశాలకు ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. దేవరకొండ మండల పరిధిలోని గన్యానాయక్‌తండా, కట్టకొమ్ము తండా, వెంకట్‌తండాల్లో లోవోల్టేజీ సమస్య వేధిస్తుందని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ నెల 18న ప్రత్యేక సమావేశం నిర్వహించనుండగా ఆ సమావేశానికి అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీపీ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ శర్మ, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా బోధించాలి



మండల నోడల్ అధికారి శేషును సన్మానిస్తున్న జిల్లా ఏఎంఓ రామచంద్రయ్య తదితరులు

నాగార్జునసాగర్: ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంఓ) రామచంద్రయ్య అన్నారు. సోమవారం పెద్దవూర మండలంలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్‌కాలనీలో గల ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన మండల నోడల్ అధికారి శేషును శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడంతో పాటు పాఠ్యాంశంలోని విషయాలను అర్థం చేసుకొని స్వంతంగా రాయగలగాలని సూచించారు. ఎస్ఆర్జీఓ సైదిరెడ్డి పాఠ్యాంశాలను సులభంగా విద్యార్థులకు అర్థమయ్యేలా ఏవిధంగా బోధించాలో వివరించారు. సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, క్లస్టర్ హెడ్‌మాస్టర్లు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

మిర్యాలగూడ టౌన్: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మిర్యాలగూడ పట్టణంలోని శివాలయం, శ్రీశ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వేకుమజామునే ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. శివలింగానికి అర్చకులు అభిషేకాలను నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ శివాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు.

విద్యార్థినుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

దేవరకొండ: విద్యార్థినుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత అన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సెకండియర్ విద్యార్థినుల పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన అర్ధ వార్షిక పరీక్షల్లో విద్యార్థినులు వెనుకబడినట్లు గుర్తించామని అందుకు గల కారణాలను సమీక్షించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థినులు నిత్యం కళాశాలకు వస్తున్నారా లేదా అని తల్లిదండ్రులు తెలుసుకోవాలని సూచించారు. హాజరు శాతంలో విద్యార్థినులు వెనుకబడుతున్నారని అన్నారు. విద్యార్థినులు కళాశాలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో అధ్యాపకులు మల్లేపల్లి పూర్ణచందర్, భాస్కర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయాలి



దేవరకొండ: అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ, నల్లగొండ టౌన్: దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ ఆధ్వర్యంలో ఆ పార్టీనాయకులు సోమవారం నల్లగొండ కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లాలునాయక్ మాట్లాడుతూ.. డిండి, చందంపేట, నేరడుగొమ్ము, పెద్దఅడిశర్లపల్లి, చింతపల్లి మండలాల్లోని అనేక గ్రామాలు ప్రజలు జిల్లా కేంద్రానికి రావాలంటే 130 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందన్నారు. దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన పాలన అందుతుందని అన్నారు. అదేవిధంగా చిత్రియాల, చెర్కుపల్లి, పద్మటప్లలి, గొడకొండ్ల గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీరెల్లి చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ, పోతెపాక సాంబయ్య, నరేందర్‌రెడ్డి, నక్క వెంకటేష్‌యాదవ్, పగిళ్ల సాగర్, బోడ శ్రీశైలం, వనం జగదీశ్వర్ తదితరులున్నారు.

రోడ్డు మంజూరు చేయాలని వినతి..

చందంపేట: మండల కేంద్రం నుంచి అచ్చంపేట పట్టి మీదుగా సిద్ధాపురం గ్రామానికి బీటీ రోడ్డును నిర్మించాలని కేతావత్ లాలునాయక్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. బీటీ రోడ్డు లేకపోవడంతో ముర్పునూతల, మన్నెవారిపల్లి మీదుగా అదనంగా 15 కి.మీ. ప్రయాణం చేయాల్సి వస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ శ్రీశైలంయాదవ్, నక్క వెంకటేశ్, జగదీశ్వర్, పగిళ్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి



హాలియాలో ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



నాగార్జునసాగర్: కమలా నెహ్రూ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జయవీర్‌రెడ్డి

హాలియా: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిదని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హాలియా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళల సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో మిగిలిన గ్యారంటీలను కూడా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, జిల్లా నాయకులు మలిగిరెడ్డి లింగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, అనుముల వైస్ ఎంపీపీ మాలే అరుణ, నిడమనూరు జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరి, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, కౌన్సిలర్లు సుధారాణి, అన్నెపాక శ్రీనివాస్, ఆంజనేయులు, నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

గజమాలతో సన్మానం..

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా హాలియాకు వచ్చిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఓపెన్ టాప్ జీపులో ఎక్కించి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో ఎమ్మెల్యేను భారీ గజమాలతో సత్కరించారు.

వంద రోజుల్లో గ్యారంటీలన్నీ అమలు చేస్తాం..

నాగార్జునసాగర్: వంద రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల కమలానెహ్రూ ఆస్పత్రిలో ఆయన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచిన సందర్భంగా దానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ సథకం పేదలకు వరంలాంటిదని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, నోడల్ అధికారి రాజ్‌కుమార్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి. వినయ్‌రెడ్డి, డాక్టర్ భానుప్రసాద్, కౌన్సిలర్ రామకృష్ణ, డాక్టర్ అమృత్‌నాయక్, జనార్దన్, ఆరోగ్యమిత్ర శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష..

నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి నాగార్జునసాగర్‌లోని తమ నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఎమ్మెల్యే మంజూరు చేసిన పనులు ఎక్కడెక్కడ చేపట్టారు? అవి ఏఏ దశల్లో ఉన్నాయి? నేటికీ మొదలుపెట్టని పనులు ఏమైనా ఉన్నయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులను సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

జయవీర్‌రెడ్డికి శుభాకాంక్షలు

హాలియా: నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కుందూరు జయవీర్‌రెడ్డి సోమవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్యాంపు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, జిల్లా నాయకులు మలిగిరెడ్డి లింగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, అనుముల వైస్ ఎంపీపీ మాలే అరుణ, నిడమనూరు జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరీ, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాంగ్‌రూట్‌లో వాహనదారుల ప్రయాణం

- ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వెళ్తుండడంతో ప్రమాదాలు



మిర్యాలగూడలోని నార్కట్‌పల్లి- అద్దంకి బైపాస్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనాలు

మిర్యాలగూడ అర్బన్: రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని పోలీసులు ఎంతగా ప్రయత్నిస్తున్నా.. వాహనాదారుల అజాగ్రత్తతో ఎక్కడో ఒక చోట తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాహనాలు రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం వలన ప్రమాదాలు ఎక్కువగా అవుతున్నాయని పోలీసులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన రోడ్లపై పలువురు వాహనదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై మిర్యాలగూడ వై జంక్షన్ నుంచి ఏడుకోట్లతండా, అన్నపురెడ్డిగూడెం వద్ద మాత్రమే రోడ్డు దాటేందుకు యూటర్న్ మార్గం ఉంది. అక్కడి నుంచి మధ్యలో ఏడుకోట్లతండా వరకు ఎక్కడా యూటర్న్ లేకపోవడం, మధ్యలో అనేక రైస్ మిల్లులు ఉండడంతో ఆ రైస్‌మిల్లులకు వచ్చే లారీలు ఎక్కువ శాతం రాంగ్‌రూట్‌నే ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా నందిపాడు రోడ్డు, చిల్లాపురం రోడ్డు వద్ద కూడా ఎక్కువగా రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండగా.. ఫ్లైఓవర్ నుంచి చింతపల్లి రోడ్డు వరకు కూడా రాంగ్‌రూట్ ప్రయాణాలు జరుగుతున్నాయి. దీనికి తోడు ఆ ప్రాంతంలో ఉన్న దాబాల వద్ద లారీలు, డీసీఎంలు, భారీ ట్రక్కులు రోడ్డు పైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వాహనాలు రోడ్డుపై నిలిపే వాహనాలను గమనించకుండా వెళ్లి ప్రమాదాలు బారిన పడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నా మారని తీరు..

పట్టణంలోని బైపాస్ రోడ్డులో ప్రమాదాల నివారణకు పోలీసులు అనేక చర్యలు చేపడుతున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, లబ్బర్ రాడ్స్ పెట్టి ప్రమాదాలను నివారిస్తుండటంతో పాటు రోడ్డుపై నిరంతరం గస్తీ తిరుగుతూ రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. తిరిగి మరలా రాంగ్‌రూట్‌లో వచ్చే వారికి జరిమానాలు సైతం విధిస్తున్నప్పటికీ కొందరు వాహనదారులు తీరు మార్చుకోవడం లేదు.

అజాగ్రత్తతోనే ప్రమాదాలు



అజాగ్రత్తతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాంగ్ రూట్‌లో వచ్చే వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. జరిమానా కూడా విధిస్తున్నాం. దాబాల వద్ద రోడ్డుపైనే వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తున్నాం. ప్రతి వాహనాదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. నిబందనలకు విరుద్ధంగా వాహనాలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

– బండి మోహన్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ, మిర్యాలగూడ

నేడు నిడమనూరుకు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి రాక

నిడమనూరు: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు నిడమనూరు మండల కేంద్రానికి వస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారి మండల కేంద్రానికి వస్తున్న ఆయన మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ కార్యకర్తలను కలుసుకుంటారని తెలిపారు.

చింతపల్లి ఎస్ఐని సర్వీసు నుంచి తొలగించాలి

చింతపల్లి: మండలంలోని పాలెం తండాకు చెందిన సూర్యనాయక్ మృతికి కారణమైన ఎస్ఐ సతీష్‌రెడ్డిని సర్వీసు నుంచి తొలగించాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్ఐ దాడి చేయడం వల్లనే సూర్యనాయక్ మృతిచెందాడని ఆరోపించారు. ఎస్ఐ సతీష్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని కోరారు.

సూర్యనాయక్ మృతి బాధాకరం



సూర్యనాయక్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న రవీంద్రకుమార్

చింతపల్లి: మండలంలోని పాలెం తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు నేనావత్‌సూర్యనాయక్ మృతి బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం పాలెం తండాలో సూర్యనాయక్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సూర్యనాయక్ మృతి పార్టీకి తీరని లోటని, మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట కంకణాల వెంకటరెడ్డి, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, చందర్‌నాయక్, ముద్దం జోగయ్య, నిరంజన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దదేవులపల్లికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామానికి సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డికి గ్రామానికి చెందిన ఇరిగి క్రాంతికుమార్ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీగా ఏర్పాటైనప్పటి నుంచి ఎస్సీ రిజర్వేషన్ రాలేదన్నారు. గ్రామంలో సుమారు 800 మంది ఎస్సీ జనాభా ఉందని అధికారులు గమనించి గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొండేటి నాగయ్య, కొడేటి నగేష్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న క్రాంతికుమార్

దేవాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కరుణాకర్‌రావు

గుర్రంపోడు: మండలంలోని బొడపాడు గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి గాను సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వెల్గపూరి కరుణాకర్‌రావు రూ.50వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వెల్గపూరి రాంబాబురావు, వెల్గపూరి శేఖర్ రావు, శ్రీనివాసరావు, ప్రసాద్, గంటా రమేష్, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని సీతారామ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గురుస్వామి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేసిన చెట్లపల్లి ఇందిర, శ్రీనివాస్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మాలధారులు సత్తయ్య, తోటపల్లి కృష్ణ, బోడ కుమార్, నగేష్ తదితనేలే పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధన

నాగార్జునసాగర్: నందికొండలోని రెడ్డి జనసేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి హాజరుకాగా ఆయనను శాలువాతో సన్మానించారు. అంతకుముందు మహిళలు ఉసిరిచెట్టుకు పూజలు చేసి విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.